నృత్యం జోరుగా సాగుతుంది. ప్రేక్షకులంతయూ రెప్పలు కొట్టడం కూడా మరిచిపోయి చూస్తున్నారు. ప్రేక్షకుల నిశ్శబ్దాన్ని శంకర్ గజ్జెల శబ్దం ఓడిస్తూంది. అతడు కథక్ నృత్యంలో మైమరిచాడు. రంగు రంగుల వెలుగుల్లో అతడు మరీ అందంగా కనుపిస్తున్నాడు. జీవితం ధారపోసి నేర్చుకున్న నృత్యంలోని ప్రావీణ్యం సభికుల మనసుల్లో ముద్రలు వేస్తూంది. నృత్యం అయిపోయింది.

వందలాదితో నిండి ఉన్న రవీంద్ర భారతి హాలు చప్పట్లతో నిండిపోయింది... చప్పట్లు వెనక నుంచి విన వస్తున్నాయి. తలకు ఎక్కుతున్న మెత్తని మత్తు — ఎక్కుతున్న దల్లా కొంచెం దిగింది. వెనుదిరిగి చూశాడు శంకర్. బాల్ కిషన్ మెల్లగా వస్తున్నాడు.

బాగా పరికించి చూశాడు. 'హాలు' కళ్లలో కరిగి కరిగి కల్లు కాంపౌండయింది. 'ప్రేక్షకులు' త్రాగుబోతు లయ్యారు. నిశ్శబ్దం పారిపోయింది.

అక్కడి వాళ్లని నవ్వులో, అరుపులో తెలియడం లేదు. బీడి, చుట్ట పొగలు ... సారా ఘాటు వాసన, తిట్లు, బూతులు... కాండ్రించి ఉమ్ములు ... అక్కడ మూలకు మాంసం కాల్చి అమ్ముకునే వాడొకడు, నాన్–వెజిటేరియన్ పడని వెజిటేరియన్‌లా మడి కట్టుకున్నట్లు దూరంగా మరో మూల మిరపకాయల బజ్జీలు అమ్ముతున్నాడు. వాటి మీద వాలే ఈగల్ని, దోమల్ని విసిరి విసిరి వేసారి ఊరుకున్నాడు.

భ్రమ కరిగి నిజం కనిపించింది. ముందున్న సీసాలు ఖాళీ అయ్యాయి. చూస్తూండగానే బాల్‌కిషన్ మరో నలుగు తెచ్చాడు. అప్పటికే శంకర్ శరీరం తేలిపోతూంది.



# చిత్ర నృత్యం

దేవరాజు మహారాజు,
బి. విద్యాసాగర్‌రావు

"ఏం ఛిచ్చ! ఉట్టిగ కూకున్నవ్, గీయింత తాగు."

"ఏ ... నీయవ్వ నాకేటో అయితంది. నా కొద్దే! రెండ్రోజుల్నించి తిండి దిన్లే. ఇయ్యాల గిది తాగితే పానం తేలిపోతాంది."

"అయ్ ... తిండెందుక్క దిన్లే మల్ల?"

"ఎవ్వలు బెట్టలే! గా మొన్ననే మా మేనేజరు కొలువుల్నించి దీశేశిండు..."

"ఎవ్వల్ని? నిన్ను దీశేశిండా?" అంత ఎల్లరిలోనైనా శంకర్ కడుపులోని పేగుల రోదన బాల్ కిషన్ విన్నాడు.

బాల్‌కిషన్ కెందుకో ఆశ్చర్యంవేసి, వెంటనే అడిగాడు: "అదె మరి గట్ల?"

"నౌకరి ఎర్మినెంటుది కాదు. టెంపర్‌వర్ది! అందుల నాకు ట్రైపు రాకుండె. టైపొచ్చి నాయన ఒస్తే, ఆయనకు తీస్కోని వ స్నెల్లగొట్టిండు. టైపు రాకుంటేంది డాన్సొత్త దన్నా!! నీ డాన్సు తోటె మా క్పని గాదు ఫో ఫో అన్నడు, మేనేజరు ..."

బాల్ కిషన్ ఓ సీసా శంకర్‌కు అందించాడు. శంకర్ కొంచెం త్రాగి మిరపకాయ కొరికాడు.

"అరెరె గట్లనా? డాన్సొత్తాది నీకు! ఏడ నేర్సినవ్?"

"కొంచె మొన్తది. కతక్ అని అదో అలగ్ టైపుంటది. రాం కోట్ల కాలేజిల నేర్శిన గని బాగ రాదు ..."

పూర్తికాకుండానే అన్నాడు బాల్ కిషన్: "అదె మరి గదెందుక్క నేర్సినవే, చిచ్చ? మంచిగ టైపు నేర్వక పోతివి? ఇగ మరి ఇప్పు డెట్ల — నౌకరేది జేస్తవ్?"

"ఏదో కాయిశునడి నేర్చుకున్న. బల్లె పదోది సదివేటప్పుడు పోరగాల్లమంత రవీంద్ర బారతి పోయి డాన్సూసొచ్చినం! గప్పటి సంది మన్సుల పడ్డది. నేన్గూడ గట్ల గావాలని... ఇగ మా నాయనున్నంత కాలం నేర్సుకుంటె తిట్టేది. గందుక్కె పాటుంగ పాటుంగ జేర నేర్సిన, ఇగ నాయిన సావంగనె ఇల్లంత నా మీద వడ్డది. మా అమ్మకు నూదు ల్గొనెటందుక్కె పైసల్జాల కుండె, ఇగ పూర్తి గెట్ల నేర్వమండె? కుదిరెటట్టు లేదని ఊకున్న."

"అయ్యో, మీ నాయిన వోయినాడు — ఏం జేసేది?" అని ప్రశ్నిస్తూ, "అగో తాగవూ" అంటూ మరో సీసా చేతి కందించి బాల్ కిషన్ శంకర్ కళ్ల వైపు చూశాడు.

అవి ఉన్నట్టుండి పచ్చిగా అయ్యాయి. "అఁ ... వోయ్యిండు. అమ్మ గూడ



ఉరుగల్లులోని నంది ఫోటో—జి. ప్రభాకర్

వోయ్యింది. నాయిన కోశిల దుక్నంల పన్జేసేది. జీతం తిండికే సాల క్పొయ్యేది. న న్నేం సద్విపిస్తడు? డాన్సేంనేర్పిత్తడు?"

తనకు తెలియకుండానే ఒళ్ళు లేచి పోతూంది. ఎదురుగా, దూరంగా ఉన్న దుకాణాలు, అందులోని మనుషులు చూచాయగా అగుపిస్తున్నారు. ఆ స్థితి ఏమిటో చెప్పడం కష్టం! ఎటూ గాని స్థితిలో అన్నాడు శంకర్: "కాలేజిల్నించెల్లగొడ్తే, గాడ పెప్పల్ బజార్ల డాన్స్ నేర్పెటాయ నుండె — గాడ్కివోతె, గా దొంగ బాడ్కావ్ అందర్కి నేర్పుగని ... నన్ను సూడంగనె ఎదన్న ఇంట్ల పన్జెప్పేది. తిండి పెట్టేది గని, 'నేర్పు సారంటె' ఇగిలిచ్చు కుంట 'నీ కెందుకురా' అనేది. ఇగ సూశి సూశి తిక్క దిరి గెల్లొచ్చిన."

"అరె! ముచ్చట వెట్టుకుంట తాగ్త లేవేందే? తాగంది జోషు రాదు. ఇప్పుడాడ ఎగరాన్నాయె ... పీన్గను బయటికి దీశిండ్రో లేదో అల్లు... ఇంక సప్పుడయితె అయితె లేదు."

"తాగ్త తాగ్త అట్లెట్ల దాగ?" అంటూ మరింత తాగాడు శంకర్. కళ్లు మబ్బుగా అయ్యాయి. లోకమే మత్తులో ఉన్నట్టనిపించింది. ఒళ్లు తిరుగుతూంది! అతని దృష్టిలో సృష్టి మారింది! ! ... విషా.

బాల్ కిషన్ కొంచెం కొంచెం తాగుతున్నాడు. అంతే! అతనికి లోకం లోకం లాగానే ఉంది. దృష్టిలో మార్పు లేదు. అతను అసలు తాగడానికి రాలేదు. శంకర్‌కు తాగించాలని వచ్చాడు. ప్రస్తుతం చనిపోయింది, బాల్ కిషన్ దూరపు బంధువు. డప్పు కొట్టేవాళ్లప్పుడే బాగా తాగి వెళ్లి పోయారు ఇంటి వైపు.

తెచ్చిన వాటిల్లోంచి రెండు మాంసం ముక్క లందిస్తూ అన్నాడు: "ఇయ్యాళ్రేపు నౌకర్లేంది తక్లీబయితది. బత్కుడు కష్టం!!"

ఈ సారి శంకర్ అవును అని విచారం ప్రకటించలేదు. గొంతు పెద్దగా జేసి అరిచినట్టుగా మాట్లాడుతున్నాడు.

"ఏం తక్లీబ్ బే ... బత్క నేర్సినోన్కి! ... గిప్పుడు పీన్గ ముందట జెర్రసే పెగిరితే — పదిహేను రూపాయలిస్త రాయె. ఇంకేంది! పెండ్లమా? పిల్లలా? గిట్లనే బత్కుతయిపాయె... గీ ఉపాయం నాకు భీ రాలే, పొద్గాల పెంటిగా డొచ్చి పెప్పిండు — సరె. గియ్యాల్లట్నించి ఎవ్వలేడ సచ్చినా ఒచ్చి ఆడ్త! — మత్‌లబ్ దెల్పమన్న ..."

"అగో డప్పు సప్పుడయితాంది. బయలెల్లుతున్నట్లున్నది. ఇగ వారాదు?"

"పా, మల్ల." లేచాడు శంకర్.

బాల్ కిషన్ లేచి, ఉరికి సీసాలు, పైసలు ఇచ్చి వచ్చాడు.

"డప్పు ఎట్ల గొడ్తాంటె, అట్ల అడుగులు వడాలె." బాల్ కిషన్ చెప్తుతూ ఉన్నాడు.

"అఁ... అఁ... ఎందుక్క వడుపూ? నాకు బాగనే ఆడొస్తది! సూస్తవు గద ఇప్పుడు — పబ్లికంత పరేశానయి సూడాలె నా ఆట !!"

"గా మాట చెప్పినవ్ మంచి గుంది... తొందర్గ నడ్సు. అంత తయారయి నట్టుంది."

బాల్ కిషన్ తొందరగా నడువ గలుగుతున్నాడు. కాని, శంకర్ బరువుగా తూలుతూ, ఏదో వాగుతున్నాడు. బాల్‌కిషన్ వినిపించుకోవడం లేదు. ఫర్లాంగు దూరం వెళ్లి ఓ ఇంటి ముందు ఆగారు.

అక్కడె —

విర్జీవుల్లో కలిసిన జీవి పాడెమీద పడుకొనుంది. పాడె నలుగురి భుజాల మీదుంది. బంధువులు, స్నేహితులు అందరు హడావిడిగా అయోమయంగా ఉన్నారు.

"పండు ముసల్ది!! రాలి పొయ్యింది." కొందరు అతి సామాన్యంగా అనుకుంటున్నారు. మరి కొందరి ముఖాల్లో ఉదాసీనత, మరో పది పదిహేను మంది ముసల్దా వ్వేమవుతారో గాని, వారి ముఖాల్లో దుఃఖం. వాళ్ల కళ్లు నిండ నీళ్లు నిండి వర్షిస్తున్న మేఘాల్లా ఉన్నాయి. కన్నీళ్లన్ని కారినా, అవి నిర్మలంగా అవడం లేదు. అలాగే ఉంటున్నాయి.

డప్పు మోగుతూంది. శంకర్ శరీరం పులకిస్తూంది — ఇప్పుడే తన జీవితంలో ప్రప్రథమంగా తన నృత్య ప్రదర్శనం ఇవ్వబోతున్నాడు గనక!

వాళ్ల పను లెవ్వో అయిపోయాయి. వాకిట్లోంచి శవం కదిలింది. అందరి కంటె ముందు డప్పుల వాళ్లు. వెనకాలే శంకర్, నృత్యకారుడు !!! — తరవాత ఒకడు నిప్పు పట్టుకుని ఉన్నాడు. ఆ తరవాత నలుగురితో మోయబడుతున్న శవం. వెనక స్త్రీలు, ఏడ్పులు! పురుషులు, మౌనం!!

కొంచెం దూరం వెళ్లినాక డప్పు లాళ్లు ఆగారు. ఆగి, వాద్యాల్ని జోరుతో వాయిస్తున్నారు. శంకర్ కళ్లలో ఏదో కదులుతూంది...

శవం అటూ, ఇటూ పెట్రోమాక్స్ లైట్లు ... హాల్లోని ఎలక్ట్రిక్ బల్బుల్లాగ, రోడ్డు స్టేజీ లాగ, పాడెమీది శవం ఓ ప్రముఖ వ్యక్తి లాగ, మిగిలిన జనం ప్రేక్షకుల్లాగా ... కళ్లలో దృశ్యాలు.

కాళ్ల బలం హెచ్చింది. అడుగులు జోరుగా పడుతున్నాయి. ఎగిరెగిరి గంతులేస్తున్నాడు, అతని జీవితాశయం తీరినట్టు!!

అతడు ఆడడం లేదు. డప్పు శబ్దం అతని లోని మైకాన్ని ఆడిస్తూంది. ఎవరి ఏడుపులు, ఎవరి ముచ్చట్లు వారి వారి కున్నాయి. అంత మంది జనంలో శంకర్ నాట్యం ఎవరూ చూడడంలేదు.

కాని —

ఏ థియేటర్లోనూ దొరకనంత హాయిగా కాళ్లు చాపుకొని, ఆ కళాకారుడి జీవితం ఎలా అనుకుంటే, ఎలాగయిందో దీర్ఘంగా ఆలోచిస్తూ తన కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన అతని నృత్యాన్ని శవం చూస్తూంది!

డప్పులు మోగుతున్నాయి. ★